andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
శుక్రవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 29.4 • కనిష్ఠం 17.8
నిర్మల్ జిల్లా వార్తలు
8
శనివారం 18 జనవరి 2025

క్యాలెండర్‌ను ఆవిష్కరించిన మంత్రి సీతక్క



పెంబి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : మున్నూరు కాపు పెంబి మండల సంఘ 2025 క్యాలెండర్‌ను మంత్రి సీతక్క, ఎమ్మెల్సీ దండే విఠల్, ఎమ్మెల్యే బొజ్జు పటేల్ చేతుల మీదుగా శుక్రవారం నిర్మల్‌లో ఆవిష్కరించారు. కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘ సభ్యులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

- అర్హులకే సంక్షేమ పథకాలను అందించాలి
- ఎంపికలో ఎలాంటి తప్పిదాలు ఉండకూడదు
- అధికారులకు స్పష్టం చేసిన మంత్రి సీతక్క
- మందమర్రి మున్సిపాలిటీపై గళమెత్తిన ఎమ్మెల్సీ దండే విఠల్
- ఏజెన్సీ ఏరియాపై మాట్లాడిన బోథ్ ఎమ్మెల్యే
- పట్టణ ప్రాంతాల్లోని కూలీలకు ఆత్మీయ భరోసా కల్పించాలన్న పాయల శంకర్
- డీఆర్‌సీ మీటింగ్ ఏర్పాటు చేయాలని మహేశ్వర్ రెడ్డి డిమాండ్
- ముఖ్య సమావేశానికి అధికార పార్టీ ఎమ్మెల్యేల డుమ్మా



కీలక పథకాల అమలుకు దిశానిర్దేశం

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రణాళిక సమావేశానికి హాజరైన మంత్రి సీతక్క, ఆయా జిల్లాల కలెక్టర్లు, ఎమ్మెల్యేలు



నిర్మల్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఈ నెల 26 తేదీ నుంచి అమలు చేయనున్న నాలుగు పథకాలకు సంబంధించి శుక్రవారం నిర్మల్‌లో ఉమ్మడి జిల్లాస్థాయి సమావేశం.. దిశా నిర్దేశంతో సాగింది. ఈ కీలక సమావేశానికి జిల్లా ఇన్‌చార్జీ మంత్రి సీతక్క హాజరయ్యారు. ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, కొత్త రేషన్‌కార్డుల పంపిణీ పథకాలకు సంబంధించి అర్హులనే ఎంపిక చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. **ఎలాంటి తప్పిదాలకు తావు లేకుండా లబ్ధిదారుల ఎంపిక పూర్తిగా పారదర్శకంగా చేపట్టాలన్నారు.** మంచిర్యాల, కొమురంభీం ఆసిఫాబాద్, ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల కలెక్టర్‌లు, అడిషనల్ కలెక్టర్‌లతో పాటు ఎమ్మెల్యేలు వెడ్మబొజ్జు, రామారావు పటేల్, మహేశ్వర్‌రెడ్డి, అనిల్ జాదవ్, పాయల శంకర్ అలాగే ఎమ్మెల్సీ దండే విఠల్‌లు ఈ సమావేశంలో పథకాల అమలుపై తమ గళం విప్పారు. లబ్ధిదారుల ఎంపిక, జాబితాల రూపకల్పన పథకాల పంపిణీ వంటి అంశాలపై వీరు పలు సూచనలు, సలహాలు అందించారు. అయితే ఈ పథకాల పంపిణీకి సంబంధించి ఏర్పాటు చేసిన కీలక సమావేశానికి ఎంపీ నగేష్‌తో పాటు అధికార పార్టీకి చెందిన చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్, మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేంసాగర్ రావు, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, సిర్పూర్ కాగజ్‌నగర్ ఎమ్మెల్యే హరీష్ బాబులు గైర్హాజరవ్వడం సమావేశంలో చర్చనీయాంశంగా మారింది. ఈ సమావేశంలో సలహాలు, సూచనలు అందించాల్సిన ఎమ్మెల్యేలు గైర్హాజరవడంపై రాజకీయ వర్గాల్లోనూ అటు అధికార వర్గాల్లోనూ చర్చకు తావిచ్చింది. కాగా.. సమావేశంలో పాల్గొన్న పలువురు ఎమ్మెల్యేలు మాట్లాడుతూ.. పథకాల అమలులో అర్హులకు అన్యాయం జరగకుండా చూడాలని కోరారు. రాజకీయాలకు అతీతంగా పథకాలను అమలు చేయాలన్నారు. అయితే ఎమ్మెల్యేలు కలెక్టర్‌ల సూచనలన్నింటినీ పరిగణనలోకి తీసుకున్న మంత్రి సీతక్క. ఈ నాలుగు పథకాల అమలుపై ప్రజలందరికీ భరోసా కల్పించే దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. అర్హులైన లబ్ధిదారులకు అన్యాయం జరగకుండా చూడడమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. ఈ నెల 21వ తేదీ నుంచి 24వ తేదీ వరకు నిర్వహించే గ్రామ సభలకు ప్రజా ప్రతినిధులంతా హాజరు కావాలన్నారు. ఈ నెల 26 నుంచి నాలుగు పథకాలను అమలు చేస్తున్నట్టు మంత్రి తెలిపారు.

మందమర్రిపై దృష్టి సారించండి



మందమర్రి మున్సిపాలిటీ నోటిఫైడ్ పరిధిలో ఉన్నందున ఇక్కడ ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ ప్రక్రియను అధికారులు ఎలా చేపడతారు !? ఈ ప్రాంతం నోటిఫైడ్ అయినందున సమస్యపై అధికారులు దృష్టి సారించి పరిష్కరించాలి.

దండే విఠల్ , ఎమ్మెల్సీ

ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌తో లబ్ధిదారుల ఎంపిక

- రాజర్షిషా, ఆదిలాబాద్ కలెక్టర్



ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌తో లబ్ధిదారులను ఎంపిక చేస్తామని ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా పేర్కొన్నారు. ఏఐ సాంకేతిక పరిజ్ఞానంతో పకడ్బందీగా పూర్తి అర్హులైన వారినే గుర్తించి ఈ పథకాన్ని వర్తింపజేస్తామంటూ ఆయన వివరించారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి



నిర్మల్ పట్టణంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి వేలల్లో అర్హులు ఉంటే కేవలం 1673 మందిని మాత్రమే ఎంపిక చేశారు. గతంలో రామారావుబాగ్, విశ్వనాథ్‌పేట్, మహాలక్ష్మి వాడ తదితర ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇళ్ల కోసం ప్లాట్లను మంజూరు చేసిన వారిలో 70శాతం మాత్రమే ఇళ్లను నిర్మించుకున్నారు. ఇంకా 30శాతం మంది ఇండ్లను నిర్మించుకోలేదు. వారందరికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలి.

(గండ్రత్ ఈశ్వర్, మున్సిపల్ చైర్మన్, నిర్మల్)

డీఆర్‌సీ మీటింగ్ ఏర్పాటు చేయాలి

(ఏలేటి మహేశ్వర్ రెడ్డి, నిర్మల్ ఎమ్మెల్యే)



జిల్లాలో ఇప్పటి వరకు డీఆర్‌సీ మీటింగ్ ఏర్పాటు చేయకపోతుండడం కారణంగా అభివృద్ధి ముందుకు సాగడం లేదని నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటీ మహేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. అర్హులైన వారికి రేషన్ కార్డుల జాబితాలో చోటు దక్కలేదని పేర్కొన్నారు. వేల మంది రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు చేసుకుంటే కొంతమందికి మాత్రమే అవకాశం కల్పించారని దీనిపై మంత్రి చర్యలు తీసుకొని అర్హులైన వారికి అందేట్టు చూడాలన్నారు.

డబుల్ బెడ్‌రూంలలో వసతుల సంగతేమిటి ?

(రామారావు పటేల్, ముథోల్ ఎమ్మెల్యే)

డబుల్ బెడ్‌రూం ఇండ్ల నిర్మాణం పూర్తయినప్పటికి అందులో ఎలాంటి సౌకర్యాలు కల్పించడం లేదని ముథోల్ ఎమ్మె ల్యే రామారావు పటేల్ పేర్కొన్నారు. అర్హులైన లబ్ధిదారులందరికీ ఖాళీగా ఉన్న డబుల్ బెడ్‌రూం ఇండ్లను కేటాయించి అందులో వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. కాగా.. ఈ సందర్భంగా అభిలాష అభినవ్ జోక్యం చేసుకొని డబుల్ బెడ్‌రూం ఇళ్లల్లో వసతుల కల్పన కోసం రాష్ట్ర ప్రభుత్వం నిధులను మంజూరు చేసిందని ఈ పనుల కోసం త్వరలోనే టెండర్‌లను నిర్వహించబోతున్నట్లు తెలిపారు.

గిరిజనేతరుల సమస్యలను పరిష్కరించాలి



(అనిల్ జాదవ్, బోథ్ ఎమ్మెల్యే)

ఆదిలాబాద్ జిల్లాలో 50శాతానికి పైగా ఏజెన్సీ ఏరియా ఉందని బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ తెలిపారు. అయితే ఈ ఏజెన్సీ ప్రాంతాల్లో దశాబ్దాల నుంచి గిరిజనేతరులు సైతం నివసిస్తున్నారని తెలిపారు. ఏజెన్సీ కారణంగా గిరిజనేతరులకు కొంత అన్యాయం జరుగుతుందని వారికి కూడా సమాన హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. సాగు చేసుకుంటున్న భూముల్లో కొండ ప్రాంతాలు కూడా ఉన్నాయని ఇక్కడ వర్షాధార పంటలు పండిస్తారని, అయితే వీటికి ఆత్మీయ భరోసా కల్పించడంపై స్పష్టతనివ్వాలన్నారు.

పట్టణ పేదలపై దృష్టి సారించండి



(పాయల శంకర్, ఆదిలాబాద్ ఎమ్మెల్యే)

గ్రామీణ ప్రాంతాల్లో ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద నిరుపేద కూలీలను ఆత్మీయ భరోసా పథకానికి ఎంపిక చేస్తున్నారని పట్టణ ప్రాంతాల్లోని పేదల పరిస్థితి ఏంటని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్ ప్రశ్నించారు. పట్టణ పేదలందరికీ ఆత్మీయ భరోసా పథకం కింద ప్రయోజనం కల్పించాలన్నారు. ఇందిరమ్మ పథకం కింద ఇంటి స్థలాలున్న వారిని మాత్రమే ఎంపిక చేస్తున్నారని, చాలా మందికి ఇంటి స్థలాలు లేవని వారి పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. ఈ విషయాన్ని సీఎం దృష్టికి తీసుకువెళ్లాలని పాయల శంకర్ మంత్రి సీతక్కను కోరారు.

నాన్‌ట్రైబల్ సమస్యను పరిష్కరించాలి

(వెడ్మ బొజ్జు, ఖానాపూర్ ఎమ్మెల్యే)



ఏజెన్సీల్లో నివసిస్తున్న నాన్‌ట్రైబల్ సమస్యలను పరిష్కరించాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు కోరారు. 2014 సంవత్సరానికి ముందు పహనీలు ఇచ్చే వారని దీంతో వారు రుణాలు పొందే అవకాశం ఉండేదని అన్నారు. ధరణి కారణంగా నాన్ ట్రైబల్స్ పూర్తిగా నష్టపోయారంటున్నారు. ప్రస్తుతం వారికి రైతుబంధు కూడా రావడం లేదని పేర్కొన్నారు. ఏజెన్సీల్లో నివసిస్తున్న గిరిజనులకు ఇందిరమ్మ ఇండ్లు కట్టుకోవడానికి ఇళ్ల స్థలాలున్నప్పటికీ వాటికి డాక్యుమెంట్లు లేవని పేర్కొన్నారు.

1800 దరఖాస్తులకు 160 రేషన్‌కార్డులు మంజూరు చేశారు



ఖానాపూర్ మున్సిపాలిటీ పరిధిలో 1800 కుటుంబాలు రేషన్ కార్డులను పొందేందుకు దరఖాస్తు చేసుకుంటే కేవలం 160 మాత్రమే రేషన్ కార్డులను మంజూరు చేయడం ఎంత వరకు సమంజసం. ఈ మంజూరు చేసిన 160లో 70 మంది ఉద్యోగులే ఉన్నారు. వెంటనే ఖానాపూర్ పట్టణంలో అర్హులైన వారందరికి రేషన్ కార్డులను మంజూరు చేయాలి.

- చిన్నం సత్యనారాయణ, ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్

షార్ట్ సర్క్యూట్‌తో రెండు ఇళ్లు దగ్ధం

సారంగాపూర్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలో గల బీరవెల్లిలో శుక్రవారం మధ్యాహ్నం షార్ట్ సర్క్యూట్‌తో రెండు ఇళ్లు దగ్ధమైనట్లు గ్రామస్థులు తెలిపారు. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గుడిసెలలో ఎవరూ లేని సమయంలో ఈ సంఘటన జరగడంతో ఇంటి లోపల ఉన్నటువంటి వస్తువులన్నీ దగ్ధమై బూడిదైనట్లు తెలిపారు. ప్రభుత్వం బాధితులను ఆదుకొని ఆర్థిక సహాయాన్ని అందించాని గ్రామస్థులు పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నర్సాపూర్(జి), జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 10 నుండి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు. మండలంలోని కుస్లీ, అంజనీ తండా గ్రామాల మధ్య పనులు జరుగుతున్నట్లు తెలిపారు.

చిరుత దాడిలో లేగదూడ మృతి



చిరుతపులి దాడిలో మృతి చెందిన లేగదూడ

సారంగాపూర్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలో గల అంతుల్‌వాయి తండా సమీపంలో గల అటవీ ప్రాంతంలో శుక్రవారం చిరుత పులి లేగదూడపై దాడి చేయడంతో లేగదూడ మృతి చెందిన విషయాన్ని తండావాసులు అటవీశాఖ అధికారు లకు సమాచారం అందించడంతో అటవీశాఖ అధికారులు నజీర్‌ఖాన్, సుజాత, వెన్నెలలు సంఘటన స్థలానికి చేరుకొని చిరుత పులి సంచరిస్తున్నట్లు గుర్తించి తండావాసులు భయాందోళనకు గురికావద్దని, చిరుత పులి కనిపిస్తే వెంటనే సమాచారాన్ని అందించాలని తెలిపారు.

అంతర్జాతీయ కరాటే
చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపిక

నిర్మల్ రూరల్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : జపాన్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ఈ నెల 18 నుంచి 22 వరకు నిర్వహించే అంతర్జాతీయ కరాటే చాంపియన్‌షిప్ పోటీలకు జిల్లా నుండి అమ్ముల భూషణ్, సుకన్య, అభిషేక్, ఎస్‌కే. అమన్, ఇర్ఫాన్ ఎంపికైనట్లు స్థానిక శిక్షకులు తెలిపారు.

మలేషియా జైల్లో మగ్గుతున్న కడెం మండల వాసులను విడిపించండి

● ఖానాపూర్ ఎమ్మెల్యేకు బాధిత కుటుంబీకుల వినతి



బాధితుల వివరాలను ఎమ్మెల్యేకు తెలుపుతున్న కాంగ్రెస్ పార్టీ ఖానాపూర్ మండల అధ్యక్షులు దొనికెని దయానంద్, ప్రవాసి మిత్ర లేబర్ యూనియన్

ఖానాపూర్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : మలేషియా దేశంలోని జైల్లో మగ్గుతున్న కడెం మండలం లింగాపూర్ గ్రామానికి చెందిన రాచకొండ నరేష్, తలారి భాస్కర్, గుండా భూమరాజు, గురిజాల రాజేశ్వర్, గురిజాల శంకర్‌లను విడిపించాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జును బాధిత కుటుంబ సభ్యులు కోరారు. ఈ మేరకు శుక్రవారం నిర్మల్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ఖానాపూర్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దొనికెని దయానంద్, ప్రవాసీ మిత్ర లేబర్ యూనియన్ అధ్యక్షులు స్వదేశ్ పరికిపండ్లల ఆధ్వర్యంలో బాధిత కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేను కలిసి తమ గోడును వెల్లబోసుకున్నారు. వీరి వినతిపై స్పందించిన ఎమ్మెల్యే బొజ్జు ఎన్‌ఆర్‌ఐ వింగ్ చైర్మన్ అంబాసిడర్ బీఎం. వినోద్ కుమార్‌కు విషయం తెలిపారు. దీంతో ఆయన మలేషియా రాయబారితో మాట్లాడి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యేకు తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో బాధిత కుటుంబ సభ్యులు గురిజాల పద్మ, రమ, భాస్కర్, భూమరాజు, లింగాపూర్ గ్రామ నాయకులు ఆకుల లచ్చన్న, నిమ్మ గణేష్, తదితరులున్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపచేసేలా కృషి

● ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్



చెక్కులను అందచేస్తున్న ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్ తదితరులు

భైంసా, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): బాధ్యతాయుతమైన విధానాల ద్వారా నియోజక వర్గ పరిధిలోని అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపచేసి లబ్ధి చేకూరేలా కృషి చేస్తానని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్ వెల్లడించారు. శుక్రవారం భైంసాలోని సురలోక్ గార్డెన్స్‌లో పట్టణ, మండల పరిధిలోని లబ్దిదారులకు కల్యాణ లక్ష్మీ, షాదిముబారక్ చెక్కులను పంపిణీ చేసిన సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. అన్ని వర్గాల అభ్యున్నతియే ధ్యేయంగా పెట్టుకొని ముందుకు సాగుతున్నామని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరికీ వర్తింప చేసేలా చర్యలు చేపట్టామని వివరించారు. లబ్ధిదారుల గుర్తింపు ప్రక్రియలో అర్హులకు అన్యాయం జరుగకుండా అధికారులు పారదర్శకమైన రీతిలో సర్వే చేపట్టాలని సూచించారు. అనర్హులను లబ్ధిదారులుగా గుర్తింపు చేస్తే సహించబోమని స్పష్టం చేశారు. కళ్యాణలక్ష్మీ, షాది ముబారక్ పథకాల ద్వారా ఆర్థికపరమైన లబ్దిపొందిన కుటుంబాలు వాటిని సద్వినియోగం చేసుకొవాలన్నారు. ఇందులో భైంసా తహసీల్దార్ ప్రవీణ్ కుమార్, ఆర్ఐ కృష్ణ, బీజేపీ భైంసా, మండల అధ్యక్షులు ఎనుపోతుల మల్లేశ్వర్, సిరం సుష్మారెడ్డిలతోలతో పాటు మాజీ ఎంపీపీ అబ్దుల్ రజాక్, పలువురు మున్సిపల్ కౌన్సిలర్లు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రతినిదులు పాల్గొన్నారు.

తీసుకున్న అప్పు తిరిగి అడిగినందుకు..
యువతిపై సర్జికల్ బ్లేడ్‌తో దాడి

● మహిళకు గాయాలు



గాయాలపాలైన యువతి దివ్య

నిర్మల్ అర్బన్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : తీసుకున్న అప్పు తిరిగి ఇవ్వాలని కోరినందుకు యువతిపై ఓ యువకుడు సర్జికల్ బ్లేడ్‌తో దాడికి పాల్పడ్డ ఘటన శుక్రవారం జిల్లాకేంద్రంలో చోటు చేసుకుంది. బాధితురాలి కథనం ప్రకారం.. జిల్లా కేంద్రంలోని సోఫీనగర్‌కు చెందిన సంతోష్‌కు అదే కాలనీకి చెందిన దివ్య అనే యువతి కుటుంబీకులు కొంతకాలం క్రితం రూ. 50వేలు అప్పుగా ఇచ్చారు. తీసుకున్న అప్పు తిరిగి ఇవ్వాలంటూ ఇటీవల సంతోష్‌ను దివ్య అడగ్గా.. ప్రతీ రోజు తొందరలోనే ఇస్తాను.. అంటూ తప్పించుకుంటున్నాడు. దీంతో డబ్బు విషయమై వారం రోజులుగా ఇద్దరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఇదే క్రమంలో గత గురువారం అప్పు ఇవ్వాలని అడిగినందుకు దివ్య తల్లిపై సంతోష్ దాడికి పాల్పడడంతో ఆమె తలకు గాయమైంది. దీంతో కుటుంబీకులు ఆమెను చికిత్స నిమిత్తం జిల్లా ఆసుపత్రికి తరలించారు. అంతటితో ఆగకుండా శుక్రవారం నిర్మల్‌లోని మినీ ట్యాంక్ బండ్‌పై నుంచి వెళుతున్న దివ్యపై సంతోష్ సర్జికల్ బ్లేడ్‌తో దాడి చేశాడు. ఈ ఘటనలో దివ్య మెడపై గాయాలు కాగా.. స్థానికులు ఆమెను వెంటనే జిల్లా ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఆసుపత్రికి చేరుకొని బాధితురాలి నుంచి వివరాలు సేకరించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు సంతోష్‌తో పాటు అతనికి సహకరించిన వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు నిర్మల్ టౌన్ సీఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ ఎల్‌వోసీని
అందజేసిన ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి



లక్ష్మణచాంద, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చామన్‌పెల్లి గ్రామానికి చెందిన అంబల్ల గంగాధర్‌కు నిమ్స్‌లో మెరుగైన చికిత్స నిమిత్తం రూ. 2 లక్షల సీఎంఆర్ఎఫ్ ఎల్‌వోసీని ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అందజేశారు. ఎల్‌వోసీ మంజూరు చేయించిన ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డికి లబ్ధిదారు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో లక్ష్మణచాంద తాజా మాజీ సర్పంచ్ ముత్యంరెడ్డి పాల్గొన్నారు.

పాల సేకరణ కేంద్రాన్ని
పరిశీలించిన విజయ డెయిరీ జిల్లా మేనేజర్



లోకేశ్వరం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సేవాలాల్ తండా గ్రామంలో గల పాల సేకరణ సెంటర్‌ను జిల్లా విజయడెయిరీ మేనేజర్ దస్రునాయక్ శుక్రవారం పరిశీలించారు. జిల్లాలోని ఈ గ్రామంలోనే అత్యధికంగా సుమారుగా 400ల లీటర్ల పాలు వస్తుండడంతో రైతులకు పాల సేకరణ వద్ద సమయం ఎక్కువ పట్టడంతో వ్యవసాయ పనులకు ఆటంకం కలుగుతుందని మేనేజర్‌కు పాడి రైతులు తెలియజేస్తూ రెండు పాల సేకరణ సెంటర్‌లను ఏర్పాటు చేయాలని మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మేనేజర్ సానుకూలంగా స్పందిస్తూ రెండు పాల సేకరణ సెంటర్‌లను ఏర్పాటు చేయడానికి పై అధికారులతో మాట్లాడి తెలియజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీఎంసీయూ ఇన్‌చార్జి మేనేజర్ గజ్జారం, డెయిరీ ఫీల్డ్ సూపర్‌వైజర్ రమేష్, పాడి రైతులు పాల్గొన్నారు.

పవిత్ర గంగాజలాన్ని సేకరించిన మెస్రం వంశీయులు

- 28న నాగోబా జాతర
- గంగాజలంతో మహాదేవుడికి అభిషేకం



పవిత్ర గంగాజలాన్ని సేకరిస్తున్న మెస్రం వంశీయులు



పవిత్ర గంగా జలానికి పూజలు చేస్తున్న మెస్రం వంశీయులు

ఇంద్రవెల్లి/జన్నారం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : ఆదివాసీల ఆరాధ్య దైవం నాగోబాకు గంగాజలంతో అభిషేకం చేసేందుకు శుక్రవారం మంచిర్యాల జిల్లా జన్నారం మండలంలోని కలమడుగు గోదావరి నదిలో గల అస్తినమడుగులో మెస్రం వంశీయులు గంగా జలాన్ని సేకరించారు. గంగాజలం కోసం ఈ నెల 10న కేస్లాపూర్ నుంచి 190 మంది మెస్రం వంశీయులు కాలినడకన బయలుదేరారు. బట్టగూడ, వడగం, సాలెవాడ, దర్మగూడ, కొత్తగూడ, ఉడుంపూర్ మీదుగా 7 రోజుల అనంతరం గురువారం రాత్రి కడెం మండలంలోని మల్లాపూర్ గ్రామానికి చేరుకున్నారు. ఆనవాయితీ ప్రకారం రాత్రి అక్కడ నిద్రించి శుక్రవారం తెల్లవారుజామున జన్నారం మండలంలోని కలమడుగు గోదావరి నదిలోని అస్తినమడుగులో గంగా జలాన్ని సేకరించి పూజలు చేశారు. వెంట తెచ్చుకున్న ఝరిలో గంగాజలాన్ని సేకరించి ప్రత్యేకపూజలు చేశారు. గోటితో వలిచిన ధాన్యాన్ని వండి నైవేద్యాన్ని సమర్పించి సహపంక్తి భోజనాలు చేశారు. అనంతరం గంగాజలంను భుజాన పెట్టుకుని ఎక్కడా కింద పెట్టకుండా తిరుగు పయనమయ్యారు. ఉట్నూరు, నర్సాపూర్ మీదుగా బయలుదేరి 24న ఆలయ సమీపంలోని చెట్టుకు గంగా జలాన్ని కడతారు. ఈ నెల 28న జరిగే నాగోబా మహాజాతరలో అస్తినమడుగులో నుంచి సేకరించిన గంగా జలంతో మహాదేవునికి అభిషేకం చేయనున్నట్లు మెస్రం వంశీయులు కటోడా హన్మంతరావు తెలిపారు. మెస్రం వంశీయులు కోసేరావు, జంగు పటేల్, తిరుపతి, మారుతి, తుకారాం, ఆనందరావు, నాగనాథ్ తదితరులు పాల్గొన్నారు.

చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.సచిన్

ఆదిలాబాద్ రూరల్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : ఆదివాసుల సమస్యల పరిష్కారానికి ఈనెల 21న చలో హైదరాబాద్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం (టీఏజీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.సచిన్ తెలిపారు. శుక్రవారం జిల్లాకేంద్రంలోని సుందరయ్య భవనంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ఆదివాసీ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ చలో హైదరాబాద్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పారు. ఆదివాసులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

మహిళకు రక్తదానం



రక్తదానం చేస్తున్న యువకుడు

ఆదిలాబాద్ రూరల్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : కొన్ని రోజులుగా రక్తహీనతతో బాధపడుతున్న చంద్రపూర్ మండలం బామిని గ్రామానికి చెందిన శాంతాబాయి అనే మహిళకు ఆదిలాబాద్ యువజన కాంగ్రెస్ అసెంబ్లీ ఉపాధ్యక్షులు సామ రుపేష్ రెడ్డి ఆధ్వర్యంలో యువకుడు రక్తదానం చేశారు. ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రిలో చికిత్స కోసం వచ్చిన మహిళకు వైద్యులు బీ పాజిటివ్ రక్తం అవసరమని కుటుంబ సభ్యులకు వైద్యులు సూచించారు. వెంటనే వారు ఆదిలాబాద్ యువజన కాంగ్రెస్ అసెంబ్లీ ఉపాధ్యక్షులు సామ రూపేష్ రెడ్డిని సంప్రదించగా ఆయన వెంటనే బేల మండలం సిర్సన్న గ్రామానికి చెందిన ముఖ్య సతీష్ అనే యువకుడితో శుక్రవారం ఆదిలాబాద్ రిమ్స్ ఆస్పత్రికొ బ్లడ్ బ్యాంకులో రక్తదానం చేయించారు. దీంతో అత్యవసర సమయంలో స్పందించిన సామ రుపేష్ రెడ్డి తోపాటు యువకుడికి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

రేపు ఆర్యవైశ్య వధూవరుల పరిచయ వేదిక

ఆదిలాబాద్ రూరల్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : ఆర్యవైశ్య సంఘం మేళా కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 19వ తేదీన మావల మండలంలోని చిల్కూరిలక్ష్మీ గార్డెన్‌లో నిర్వహిస్తున్నట్లు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు రాజేశ్వర్ కొత్తవార్ అన్నారు. శుక్రవారం ప్రింట్ మీడియా ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వధూ వర పరిచయ వేదికకు సంబంధించిన కరపత్రాలను సంఘం సభ్యులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. వధూవర పరిచయ వేదిక కార్యక్రమంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాతోపాటు మహారాష్ట్ర, ఇతర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో హాజరవుతున్నారని తెలిపారు. పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. సమావేశంలో సంఘం ప్రధాన కార్యదర్శి కొత్త హరిష్, కోశాధికారి గందేవార్ నర్సిములు, సభ్యులు ఉల్లస్, గజానన్, సుధాకర్ ఉన్నారు.



కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

మహాధర్నాను విజయవంతం చేయండి



పోస్టర్లను విడుదల చేస్తున్న ఆదివాసీ సంఘాల నాయకులు

తలమడుగు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): తలమడుగు ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో జనవరి 20న చలో ఉట్నూర్ మహాధర్నాను విజయవంతం చేయాలని తుడుం దెబ్బ డివిజన్ అధ్యక్షులు కుమ్ర జ్ఞానేశ్వర్ కోరారు. శుక్రవారం మండలంలోని పున్నగూడ గ్రామంలో ఏర్పాటు చేసిన పోస్టర్ల ఆవిష్కరణ కార్యక్రమంలో జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ ఈనెల 20న ఆదివాసీ సంక్షేమ పరిషత్ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహాధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఆదివాసుల సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ధర్నాలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ఆదివాసి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన కనుగుట్ట గ్రామ యువకులు



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న కనుగుట్ట గ్రామ యువకులు

బోథ్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కనుగుట్ట గ్రామంలో సమస్యలను పరిష్కరించాలని కోరుతూ స్థానిక శాసనసభ్యులు జాదవ్ అనిల్‌కు శుక్రవారం వినతి ఇచ్చారు. ఈ సందర్భంగా వారు గ్రామంలో హైమాస్ లైట్లు ఏర్పాటు చేయాలని గ్రామంలో బైపాస్ రోడ్డుతో పాటు వంతెన నుంచి గాంధీ విగ్రహం వరకు సీసీ రోడ్డు పనులు చేపట్టాలని కోరారు. అంతేగాక స్మశాన వాటిక వద్ద నీటి సౌకర్యం కల్పించాలని వినతిపత్రంలో కోరారు. సమస్యలను తక్షణమే పరిష్కరిస్తామని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ మునిగల రమేష్, నవ్వ రవీందర్, భీమ బుచ్చన్న, నవ్వరాజు, బోడ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

కళాశాల అధ్యాపకుడికి ఆత్మీయ సన్మానం

నార్నూర్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : గాదిగూడ మండలంలోని రుప్పాపూర్ గ్రామం పేద కుటుంబానికి చెందిన గైక్వాడ్ దేవిదాస్‌కు ఇటీవలే కళాశాల అధ్యాపకునికి ప్రభుత్వ ఉద్యోగం రావడంతో అంబేడ్కర్ అసోసియేషన్ వారు శుక్రవారం మండల కేంద్రంలో ఆయనని శాలువాతో సన్మానం చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా విలాస్ వాగ్మారే మాట్లాడుతూ ఆదివాసీ గ్రామం నుంచి ప్రభుత్వ ఉద్యోగానికి ఎంపిక కావడం హర్షించదగ్గ విషయమన్నారు. విద్యతోనే సమాజ అభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. ఇప్పటి పోటీ ప్రపంచంలో పేదవారికి విద్య అమూల్యమైన బ్రహ్మాస్త్రం అన్నారు. ఎలాంటి కఠిన పరిస్థితులు ఉన్నా తల్లిదండ్రులు విద్యార్థులకు విద్యను అందించేలా సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు మనోహర్ జాబడే, రాహుల్ జాబడే, ఆత్రం అశోక్, అముల్ లక్ష్మణ్ పాల్గొన్నారు.



గైక్వాడ్ దేవదాస్‌ను సన్మానిస్తున్న అసోసియేషన్ సంఘ నాయకులు

ఆదివాసీ మహాధర్నాను విజయవంతం చేయాలి

- గాదిగూడ మాజీ ఎంపీపీ ఆడా చంద్రకళ



పోస్టర్ విడుదల చేస్తున్న గాదిగూడ మండల ఆదివాసీ నాయకులు

నార్నూర్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : ఆదివాసీ సంక్షేమ పరిషత్ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో ఉట్నూర్‌లో ఈనెల 20న చేపట్టిన మహాధర్నాకు తొమ్మిది తెగల ప్రజలు ప్రజాప్రతినిధులు, రాయిసెంటర్ సభ్యులు అన్ని సంఘాల నాయకులు అధిక సంఖ్యలో వచ్చి ధర్నా కార్య క్రమాన్ని విజయవంతం చేయాలని గాదిగూడ మండల మాజీ ఎంపీపీ ఆడా చంద్రకళ రాజేశ్వర్ పిలుపునిచ్చారు. శుక్రవారం మండలకేంద్రంలో ఆదివాసీ సంఘాల నాయకులతో సమావేశంలో మాట్లాడారు. కార్యక్ర మంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండల అధ్యక్షులు కుమ్ర విలాస్, సత్యపాల్, కనక ప్రభాకర్, భీంరావ్, ఆత్రం నాగోరావ్, మాజీ సర్పంచ్ మెస్రం జైవంత్‌రావు పాల్గొన్నారు.

బోథ్ నియోజకవర్గ సమస్యలు పరిష్కరించండి

- మంత్రి సీతక్క సమక్షంలో ప్రస్తావించిన ఎమ్మెల్యే



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

బోథ్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : బోథ్ నియోజకవర్గంలో గిరిజనులు, ఇతరులు ఎదుర్కొంటున్న సమస్యలపై శుక్రవారం నిర్మల్‌లో జరిగిన జిల్లా స్థాయి సమీక్ష సమావేశంలో స్థానిక శాసనసభ్యులు అనిల్‌జాదవ్ గళం విప్పారు. ఎంతోమంది గిరిజనేతరులు పోడు వ్యవసాయం చేసుకుంటున్నారని వారికి పట్టాలు ఇవ్వాలని జిల్లా ఇంచార్జి మంత్రి ధనసరి అనసూయ సీతక్క ముందు వివరించారు. ఆదివాసి గిరిజనులు పూర్తిగా వర్షాధారం పైనే ఆధారపడి పంటలు పండిస్తున్నారని వారికి రైతు భరోసా ఏ విధంగా అందిస్తారో వివరించాలని సభ దృష్టికి తీసుకువెళ్లారు. అంతేగాక రేషన్ కార్డుల కోసం వేల మంది దరఖాస్తు చేసుకుంటే ప్రభుత్వ పరంగా పంపించిన జాబితాలో వందల్లో ఉన్నారని దరఖాస్తుదారులందరికీ రేషన్ కార్డులు వచ్చే విధంగా చూడాలని సూచించారు. వాళ్లకు ఎలాంటి హక్కు పత్రాలు లేదనివారికి రైతు భరోసా పథకాన్ని అమలు చేయాలని కోరారు. ఇంటి స్థలం లేని ప్రజలకు ఏ విధంగా ఇండ్లు మంజూరు చేస్తారని ఏజెన్సీ ప్రాంతాల్లో నివసిస్తున్న గిరిజనేతరులకు ఎంత శాతం ఇండ్లు మంజూరు చేస్తారని అడిగారు. తన నియోజకవర్గంలో ఉన్న నిరుపేదలందరికీ నివాసానికి అవసరమైన ఇండ్లు మంజూరు చేయాలని కోరారు.

అజయ్ పవర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో దుప్పట్ల పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

ఉట్నూర్, జనవరి 11 (ఆంధ్రజ్యోతి) : వెనుకబడిన సామాజిక వర్గం, వెనుకబడిన ప్రాంతం నుంచి విద్యావంతులైన, తమ తోటి సామాజిక వర్గానికి చెందిన ప్రజలకు సహాయ సహకారం అందించి,వారిని సామాజిక చైతన్యం కలిగించి, వారిని అభివృద్ధి వైపు తీసుకువెళాల్సిన అవసరం ఉందని అజయ్ పవర్ ఫౌండేషన్ చైర్మన్ పవర్ అజయ్ పేర్కొన్నారు. సామాజిక బాధ్యతగా అజయ్ పవర్ ఫౌండేషన్ తన, తమకు చేతనైన సహాయ సహకారాలు ఈ ప్రాంత ప్రజలకు అందిస్తుందని అజయ్ పవర్ అన్నారు. అందరూ చైతన్యవంతులై అభివృద్ధి వైపు పయనించాలని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. శుక్రవారం బానోత్ గౌతమ్ మల్లేశ్వరిల ప్రథమ పుత్రుడు రుద్రాన్ష్ పుట్టినరోజు సందర్భంగా,ఉట్నూర్ మండలంలోని కొలాం గూడ, మానిగూడలో 30 మంది కొలాం గిరిజనులకుదుప్పట్లు పంపిణీ చేశారు. సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ ప్రజల అభివృద్ధి కోసం, చైతన్యం కోసం ప్రతి ఒక్క విద్యావంతులు పాటుపడాలని ఆశాభావం వ్యక్తం చేశారు. సామాజిక బాధ్యతగా అజయ్ ఫౌండేషన్ ఎప్పుడు ముందు వరుసలో ఉంటుందని ఆయన పేర్కొంటూ, ఎవరికి ఎలాంటి సహాయ సహకారాలు అవసరమున్న, మా చేతనైన సహకారాలు అందిస్తామని ఆయన ప్రజలకు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు బానోత్ రామారావు, బానోత్ విజయబాయి, పవర్ సరిత, జాదవ్ జగదీష్, రాజేశ్వర్, జాదవ్ రాజు, ట్రిబుల్ఆర్ చైర్మన్ కుమ్ర శ్రీనివాస్, ఆడ నాగేశ్వర్, జాదవ్‌విలాస్, పవర్ రఘునాథ్, ఎల్ఐసీ ఏజెంట్ గంగారాం, గ్రామ పటేల్ కొడప జగు పటేల్, కొడప రాజు, భీంరావు, మాణిక్ రామ్ లక్ష్మణ్, రాందాస్, రాము, శీను, అజయ్ ఫౌండేషన్ సభ్యులు జాదవ్ ప్రవీణ్, రోహిత్, సాయి కిరణ్, సాహితి, విరాట్ పవర్ పాల్గొన్నారు.

అప్పుల బాధ తట్టుకోలేక దంపతుల ఆత్మహత్య

- కాల్వ అడవుల్లో సంఘటన
- మృతులు సారంగాపూర్ మండలం చించోలి(బి) గ్రామవాసులు



దిలావర్‌పూర్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : అప్పుల కుంపటి ఆ దంపతుల ఉసురు తీసింది. రుణదాతల ఒత్తిడి తట్టుకోలేక మనస్థాపానికి గురైన ఆ దంపతులు వేరే దారి లేక మరణమే శరణ్యమని భావించారు. కలిసే తనువు చాలించాలని నిశ్చయించుకున్నారు. కుటుంబ సభ్యులందరినీ ఆప్యాయంగా పలకరించారు. ఊరికెళ్తున్నామని ఇంట్లో చెప్పి బయలుదేరిన ఆ దంపతులు నేరుగా కాల్వ అడవులకు చేరుకొని ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. దిలావర్‌పూర్ ఎస్సై లోకసందీప్ తెలిపిన వివరాల ప్రకారం... సారంగాపూర్ మండలం చించోలి(బి) గ్రామానికి చెందిన కొరిపెల్లి భాస్కర్‌రెడ్డి(62), అనసూయ(60) దంపతులు. భాస్కర్‌రెడ్డి ఆర్టీసీ కండక్టర్‌గా ఏడాదిన్నర క్రితం రిటైర్డ్ అయ్యారు. ఈ దంపతులకు ఇద్దరు కొడుకులు కాగా, భాస్కర్‌రెడ్డి రిటైర్డ్ కాగానే వచ్చిన బెనిఫిట్స్‌తో పాటు మరికొంత అప్పు చేసి ఇంటి నిర్మాణం చేశారు. తీసుకున్న అప్పులకు వడ్డీలతో కలిపి సుమారు రూ. 70 లక్షల వరకు చేరుకోవడం, అప్పులు ఇచ్చిన వారు ఒత్తిడి చేయడంతో తీవ్ర మనస్తాపం చెందిన భాస్కర్‌రెడ్డి దంపతులు ఆత్మహత్య చేసుకోవాలన్న నిర్ణయానికి వచ్చి ఉండవచ్చని భావిస్తున్నట్లు చెప్పారు. గురువారం కుటుంబ సభ్యులందరితో ఆప్యాయంగా పలకరించిన భాస్కర్‌రెడ్డి దంపతులు ముథోల్‌లోని కంటి ఆసుపత్రికి వెళ్లి వస్తామని ఇంట్లో చెప్పి బయలుదేరారు. అయితే మా అమ్మ నాన్నలు ముథోల్ వెళ్తున్నామని చెప్పి ఇంటికి తిరిగి రాలేదని, ఫోన్ స్విచ్ ఆఫ్‌గా ఉందని, ఆచూకీ దొరకడం లేదని వారి కొడుకులు సారంగాపూర్ పోలీసుస్టేషన్ శుక్రవారం ఉదయం ఫిర్యాదు చేశారు. కాగా భాస్కర్‌రెడ్డి దంపతులు ముథోల్ వెళ్లకుండా నేరుగా కాల్వ అడవుల్లో వెళ్లి బండరాయిపై ఎక్కి అనసూయ చీరతో చెట్టుకు ఇద్దరు ఉరేసుకుని ఒకేసారి బండరాయిపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై సందీప్ తెలిపారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సందీప్ తెలిపారు.

పాఠశాల భవన నిర్మాణాన్ని పరిశీలించిన ఈఈ



పనులు పరిశీలిస్తున్న ఈఈ, డీఈఈలు

ముథోల్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన ముథోల్‌లో శుక్రవారం రూ. 2.30 కోట్లతో జరుగుతున్న కస్తూరిబా గాంధీ పాఠశాల అదనపు గదుల నిర్మాణం పనులను ఈఈ అశోక్, డీఈఈ గంగాధర్ గౌడ్, ఏఈ భార్గవ్‌లు పరిశీలించారు. గడువులోపు పనులు పూర్తి అయ్యేటట్లు చర్యలు చేపడుతున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు.

క్షేత్రస్థాయిలో కొనసాగుతున్న సర్వే

ముథోల్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 26 నుంచి రైతు భరోసా, రైతు ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పథకాలను తెలంగాణ ప్రభుత్వం అమలు చేయనున్న నేపథ్యంలో అధికారులు క్షేత్రస్థాయిలో సర్వేను చేపడుతున్నారు. మండలంలోని చించాల, తరోడా తదితర గ్రామాల్లో శుక్రవారం ఎంపీడీవో శివకుమార్, ఏవో, రెవెన్యూ అధికారులు సర్వేను పరిశీలించి పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు.

పారదర్శకంగా లబ్దిదారుల గుర్తింపు సర్వే



భైంసాలో రేషన్‌కార్డుదారుల ఎంపిక కోసం సర్వే నిర్వహిస్తున్న మున్సిపల్ కమిషనర్ రాజేష్ కుమార్ తదితర అధికారులు

భైంసా, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిదారుల ఎంపిక కోసం పారదర్శకమైన రీతిలో సర్వే చేపడుతున్నామని భైంసా మున్సిపల్ కమిషనర్ రాజేష్ కుమార్ వెల్లడించారు. శుక్రవారం మున్సిపల్ మేనేజర్ గౌరిష్ కుమార్, రెవెన్యూ అధికారి రమేష్, సూపర్‌వైజర్ ఎతేషామ్‌లతో కలిసి పలు వార్డులలో క్షేత్రస్థాయిలో పర్యటించి రేషన్‌కార్డుదారుల లబ్దిదారుల గుర్తింపు సర్వేను పర్యవేక్షించారు. ప్రభుత్వ అందించిన జాబితాను అనుసరించి సర్వే కొనసాగుతోందని వివరించారు. జాబితాలో పేర్లున్న ప్రతి వ్యక్తి ఇంటికి వెళ్లి ప్రభుత్వం నిర్దేశించిన వివరాలన్నింటిని ఆరా తీస్తూ సర్వే చేపడుతన్నామని తెలిపారు.లోపాలకు తావులేకుండా సర్వే ప్రక్రియ సజావుగా కొనసాగేందుకు గాను పకడ్బందీ చర్యలు చేపట్టినట్లుగా వివరించారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా రాథోడ్ బిక్కు



రాథోడ్ బిక్కు

నార్నూర్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : భారతీయ జనతా పార్టీ నూతన మండల అధ్యక్షు నిగా రాథోడ్ బిక్కును నియమించారు. పార్టీ అధిష్టానం, కొమురం భీరం ఆసిఫాబాద్ భారతీ య జనతా పార్టీ జిల్లా అధ్యక్షులు కొత్తపల్లి శ్రీనివాస్ ఆదేశాల మేరకు జిల్లా ఎన్నికల అధి కారి శ్రీశైలం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ఉపాధ్యక్షునిగా పార్టీ కోసం చేసిన సేవలను పార్టీ అధిష్టానం తనపై నమ్మకంతో మండల బాధ్యతలు ఇవ్వడం సంతోషకరమైన విషయం అని బిక్కు తెలిపారు. పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. ప్రజా సంక్షేమంలో బీజేపీ పార్టీ రాబోయే స్థానిక ఎన్నికల్లో సత్తా చాటుతుందని ధీమా వ్యక్తం చేశారు.

విజయవంతమైన పశువుల

గర్భకోశ ఉచిత చికిత్స శిబిరం



గర్భకోశ చికిత్స నిర్వహిస్తున్న పశువైద్యాధికారి డాక్టర్ రవీందర్

లోకేశ్వరం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సాత్‌గాం గ్రామంలో శుక్రవారం గర్భ కోశ ఉచిత చికిత్స శిబిరం విజయవంతమైంది. ఈ శిబిరంలో మండల పశువైద్యాధికారి డాక్టర్ రవీందర్ పశువులకు గర్భకోశ చికిత్సలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రవీందర్ మాట్లాడుతూ... రైతులు పశువులు ఎదకు వచ్చినప్పుడు మా సిబ్బందికి తెలియపరచాలన్నారు. వారు కృత్రిమ గర్భధారణ చేస్తారు. పుట్టిన మేలు రకం ఆడ దూడల వలన మనకు అధిక పాల ఉత్పత్తి పెరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని పాడి రైతులు వినియోగించుకోవాలని కోరారు. శిబిరంలో గర్భకోశ చికిత్సలు 22, పశువులకు చూడి పరీక్షలు 34, దూడలకు నట్టల నివారణ మందులు 31 చేశారు. ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారి డాక్టర్ రవీందర్, సూపర్‌వైజర్ రమేష్, గోపాలమిత్రలు సాయన్న, పోశెట్టి, గంగన్న, రైతులు, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

ఆహార భద్రత సర్వే పరిశీలన

లోకేశ్వరం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : లోకేశ్వరం మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో నిర్వహిస్తున్న ఆహార భద్రత(రేషన్ కార్డు) సర్వేను శుక్రవారం ఎంపీడీవో వెంకట రమణ, ఎంపీవో సాల్మన్ రాజ్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఆహారభద్రత (రేషన్ కార్డు) సర్వేను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ఆహార భద్రత (రేషన్ కార్డు)కు అర్హులు ఉన్న ప్రతి ఒక్కరూ నష్టపోకుండా సర్వేను చేయాలన్నారు. ఈ కార్య క్రమంలో రెవెన్యూ సిబ్బంది, వ్యవసాయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి, తదితరులు పాల్గొన్నారు.

ఫటా..ఫట్...

పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి

● గౌరీష్‌కుమార్, మున్సిపల్ మేనేజర్, భైంసా



భైంసా, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): పట్టణ వాసులందరూ పన్నులను సకాలంలో చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలని భైంసా మున్సిపల్ మేనేజర్ గౌరీష్ కుమార్ కోరారు. పట్టణప్రగతికి పన్నులు ఎంతగానో దోహదపడుతాయని వెల్లడించారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు.

ఆంధ్రజ్యోతి: పట్టణ పరిధిలో పన్నుల లక్ష్యం ఎంత మేర ఉంది.?

మేనేజర్: పట్టణ పరిధిలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి ఆస్తి పన్ను లక్ష్యం రూ.5.56 కోట్లు, నీటి పన్ను లక్ష్యం రూ.72.23 లక్షలుగా ఉంది.

ఆంధ్రజ్యోతి: పన్నుల వసూళ్ల ప్రక్రియ ఏ విధంగా కొనసాగుతోంది?

మేనేజర్: ప్రణాళికాబద్ధమైన విధానాల ద్వారా పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టిసారించాం. ఇప్పటివరకు ఆస్తి పన్నుకు సంబంధించి రూ. 1.46 కోట్ల మేర, నీటి పన్నుకు సంబంధించి రూ.13 లక్షల వరకు వసూళ్ల చేపట్టాం.

ఆంధ్రజ్యోతి: గత ఆర్థిక సంవత్సరం పన్నుల వసూళ్ల ఎంతమేర జరిగాయి?

మేనేజర్: గత ఆర్థిక సంవత్సరం మున్సిపల్ పరిధిలో పన్నుల లక్ష్యం రూ.5.02కోట్లు ఉండగా 48.60శాతంతో రూ.2.44 కోట్లు వసూలు చేశాం.

ఆంధ్రజ్యోతి: పన్నుల వసూళ్లకు ఎలాంటి చర్యలు చేపట్టారు?

మేనేజర్:ఆస్తి పన్ను వసూళ్ల కోసం 9మంది బిల్ కలెక్టర్లు, నీటిపన్ను వసూళ్ల కోసం 4 గురు మంది బిల్ కలెక్టర్లు రోజు వారీ లక్ష్యంతో క్షేత్రస్థాయిలో పనిచేస్తున్నారు. వార్షిక సంవత్సరం ముగింపు దశకు చేరుకుంటున్న తరుణంలో బిల్ కలెక్టర్లతో పాటు అదనపు సిబ్బందిని పన్నుల వసూళ్ల కోసం నియమించి ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నాం.



దంతన్‌పల్లిలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

గ్రామాల్లో ఎమ్మెల్యే సుడిగాలి పర్యటన

ఉట్నూర్, జనవరి17 (ఆంధ్రజ్యోతి): ఉట్నూర్ మండలంలోని గిరిజన గ్రామాల్లో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ శుక్రవారం సుడిగాలి పర్యటన చేశారు. జెండాగూడ, నాయక్‌పోడు, శివగూడ గిరిజన గ్రామాల్లోని కొలాం, నాయక్‌పోడు గిరిజనులకు ఖానాపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు వెడ్మబొజ్జు పటేల్ శుక్రవారం దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొజ్జు పటేల్ మాట్లాడుతూ ఈ ప్రాంతంలోని నిరుపేదలకు సేవ చేయడమే తమ లక్ష్యమని అన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని మారుమూల గ్రామాల్లో పెరుగుతున్న చలిని దృష్టిలో ఉంచుకొని నిరుపేద కొలాం, నాయకపోడు గిరిజనులకు తమవంతుగా దుప్పట్లు పంపిణీ చేశామని తెలిపారు.

గ్రామాలను సుందరంగా తీర్చిదిద్దడమే ప్రజాప్రభుత్వ లక్ష్యం

గ్రామాలను సుందరంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రజాప్రభుత్వం కృషి చేస్తోందని, అసెంబ్లీ ఎన్నికల వేళ ఇచ్చిన ప్రతీ హామీని దశల వారీగా నెరవేరుసున్నామని ఖానాపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు వెడ్మబొజ్జు పటేల్ పేర్కొన్నారు. మండలంలోని దంతన్‌పల్లి గ్రామంలో రూ.20 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు,డ్రైనేజీ పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాలను సుందరంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని అన్నారు. ప్రతి గ్రామంలో రోడ్లు, డ్రైనేజీ, నీటి సమస్యలను పరిష్కరిస్తున్నామన్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని పక్కగా అమలు చేస్తున్నామని తెలిపారు.గ్రామాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జైనూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బానోత్ జైవంతరావు, ఆర్పీఏ జిల్లా సభ్యులు దూట రాజేశ్వర్,ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు లింగంపల్లి చంద్రయ్య,ఉట్నూర్ మండల అధ్యక్షులు అబ్దుల్ ఖయ్యుం ,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఇక్బాల్, మాజీ సర్పంచ్‌లు భీమన్న, జగదీష్ జాదవ్, కాంగ్రెస్ నాయకులు దాసండ్ల ప్రభాకర్, రాజేష్ నాయక్ ,దూట మహేందర్, గ్రామ పటేళ్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.



కొలాం గిరిజనులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

వేలల్లో దరఖాస్తులు.. మంజూరు వందల్లోనే!

● ఆందోళనలో దరఖాస్తుదారులు

బోథ్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం అర్హులైన వారందరికీ రేషన్ కార్డులను అందిస్తామని ప్రకటనలిస్తున్నా ప్రభుత్వం నుంచి ఆన్‌లైన్ మంజూరైన జాబితాలో మాత్రం సోనాల, బోథ్ మండలాల కలిపి 1,344 మందికి మాత్రమే రేషన్‌కార్డులు మంజూరు అయినట్లు జాబితాలో పేర్కొన్నారు. బోథ్ మండలంలో కేవలం 874 మందికి సోనాల మండలంలో 470 మంది రేషన్ కార్డులకు అర్హులుగా పేర్కొంటూ జాబితా విడుదల అయింది. దీంతో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు ఆందోళన వ్యక్తపరుస్తున్నారు. తమకు అర్హత ఉన్న జాబితాలు పేర్లు రాలేవంటూ ఎంపీడీవో కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. అయితే అధికారులు వచ్చినవారికి సమాధానం చెప్పలేక సతమతమవుతున్నారు. అంతేగాక మండలంలో వేల సంఖ్యలో గ్యాస్ సిలిండర్లకు సంబంధించిన మహాలక్ష్మీ పథకం సబ్సిడీ డబ్బులు రాకపోగా విద్యుత్ బిల్లులు మాఫీకి సంబంధించి ఇబ్బందులు తప్పడం లేదు. 200 యూనిట్ల లోపు విద్యుత్తు వినియోగిస్తున్న బిల్లులు మాత్రం వస్తున్నాయని లబ్ధిదారులు వాపోతున్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన వారికి అందడం లేదన్న విమర్శలు వస్తున్నాయి.

'గిరిజన రైతులను మోసగించిన విద్యుత్ కాంట్రాక్టర్'

బోథ్, జనవరి17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సాంగ్వి గ్రామ పంచాయతీకి చెందిన గిరిజన రైతులను విద్యుత్ శాఖ కాంట్రాక్టర్ మోసగించారని ఆ గ్రామ రైతులు ఆరోపిస్తున్నారు. గత ఏడాది గ్రామానికి చెందిన 16 మంది రైతులు తమ చేలకు విద్యుత్ సౌకర్యం కల్పించాలని కోరడంతో విద్యుత్ కాంట్రాక్టర్ రైతుల చేలకు విద్యుత్ స్తంభాలు ఏర్పాటుచేస్తామని చెప్పి 20వేల రూపాయల చొప్పున తీసుకోవడం జరిగిందన్నారు. అయితే ఇంతవరకు విద్యుత్ స్తంభాలు వేయకపోగా తమను ఇబ్బందులు పాలు చేశాడని రైతులు వాపోయారు. గత్యంతరం లేక ఇటీవల తాము విద్యుత్ కనెక్షన్ కోసం 5,300 చొప్పున డీడీ చెల్లించడం జరిగిందని రైతులు వాపోయారు. ఈ విషయంలో విద్యుత్ అధికారులు తగు చర్యలు తీసుకొని న్యాయం చేయాలని కోరారు.



భైంసాలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే నిర్వహిస్తున్న మున్సిపల్ కమిషనర్ రాజేష్ కుమార్, ఇతర సర్వే అధికారులు

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల గుర్తింపు సర్వే

98.30శాతం పూర్తి



● ముగింపు దశలో సర్వే ● అర్హుల జాబితాకు అధికారుల కసరత్తు
● ఈనెల 21 నుంచి గ్రామ,వార్డు సభల నిర్వహణ
● అక్కడే అర్హుల జాబితాల ప్రదర్శన, లబ్ధిదారుల ఎంపిక ● 26లోపు ప్రక్రియ పూర్తి

భైంసా, జనవరి17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల గుర్తింపు సర్వే ముగింపు దశకు చేరుకుంది. రెండు రోజుల్లోగా సర్వేను పూర్తి చేసే దిశగా అధికారులు చర్యలను ముమ్మరం చేశారు. జిల్లాలోని 18 మండలాలు, మూడుమున్సిపాలిటీల పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల కోసం మొత్తం 1,92,233 దరఖాస్తులు రాగా శుక్రవారం వరకు 98.30 శాతంతో 1,88,964 దరఖాస్తుల సర్వే ప్రక్రియ పూర్తయ్యింది.

● ప్రతికూల పరిస్థితులను అధిగమిస్తూ కొనసాగిన సర్వే

జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల గుర్తింపుసర్వే ప్రతికూల పరిస్థితులను అధిగమిస్తూ కొనసాగింది. యాప్‌కు సంబంధించిన సర్వే మొరాయింపుతోపాటు సాంకేతిక సమస్యలు దరఖాస్తుదారుల వివరాలు నమోదులో సమస్యలు ఏర్పడ్డాయి. దరఖాస్తుదారులు సర్వే అధికారులకు సరియైన రీతిలో స్పందించకపోవడం, సకాలంలో పత్రాలు అందివ్వకపోవడం లాంటి సమస్యలతో సర్వే నిర్వాహణలో ఇబ్బందులు ఏర్పడ్డాయి. అయినప్పటికి అధికారులు అవాంతరాలను అధిగమిస్తూ, అడ్డంకులు తొలగించుకుంటూ సర్వేను చేపట్టారు. జిల్లాలో శుక్రవారం సాయంత్రం వరకు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల గుర్తింపు సర్వే 98.30 శాతం పూర్తయ్యింది. ఇందులో మామడ మండల పరిధిలో 100 శాతం పూర్తయ్యింది. మిగతా మండలాలను పరిశీలిస్తే పెంబి మండలంలో 99.91 శాతం, ముథోల్ మండలంలో 99.86 శాతం, సారంగపూర్, దిలావర్‌పూర్ మండలాల్లో 99.85 శాతం, నిర్మల్ రూరల్ పరిధిలో 99.84 శాతం, బాసర మండలంలో 99.79 శాతం, కుంటాల మండలంలో 99.69 శాతం, నర్సాపూర్(జి) మండలంలో 99.57 శాతం, భైంసా మండలంలో 99.40 శాతం, తానూర్ మండల పరిధిలో 99.32శాతం, ఖానాపూర్ మున్సిపల్ పరిధిలో 99.20 శాతం, కుభీర్ మండలంలో 99.18 శాతం, లక్ష్మణ్‌చాంద మండలంలో 99.15 శాతం, దస్తూరాబాద్ మండలంలో 98.93శాతం, సోన్ మండలంలో 97.90 శాతం, కడెం మండలంలో 97.64 శాతం, ఖానాపూర్ మండలంలో 96.95 శాతం, లోకేశ్వరం మండలంలో 96.91 శాతం, భైంసా మున్సిపల్ పరిధిలో 96.72 శాతం, నిర్మల్ మున్సిపల్ పరిధిలో 92.96 శాతం ఇందిరమ్మ ఇండ్ల సర్వే పూర్తయ్యింది.

● పకడ్బందీగా సర్వే ప్రక్రియ

ప్రజాపాలనలో భాగంగా దరఖాస్తు చేసుకున్న వారందరి ఇళ్లకు సర్వేయర్లు వెళ్లి ఇందిరమ్మ ఇళ్ల యాప్‌లో వారి వివరాలు నమోదు చేశారు. సంబంధిత యాప్ ద్వారా ప్రతీ దరఖాస్తును అన్ని కోణాల్లో క్షుణ్ణంగా పరిశీలనలు చేపడుతున్నారు. యాప్ సర్వేలో ఇందిరమ్మ ఇంటికి అర్హులేనని తేలినప్పటికీ, సమగ్ర కుటుంబ సర్వేలో ఆదాయపన్ను చెల్లిస్తున్నట్లు, ఇతర ప్రాంతాల్లో ఇల్లు, కారు ఉన్నట్లు వెల్లడైతే సదరు దరఖాస్తును పక్కన పెట్టనున్నారని సమాచారం. మొదటి విడుతలో స్వంత స్థలం ఉండి నిరుపేదలైన వారికే ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయనున్నట్లుగా ప్రభుత్వం ఇది వరకే ప్రకటించింది. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియలో భాగంగా యాప్‌లో నమోదు చేసిన దరఖాస్తుదారుల వివరాలను, ప్రభుత్వం వద్ద నున్న ఇతర వివరాలతోనూ పూర్తిస్థాయిలో విచారణ చేపట్టే దిశగా చర్యలు మొదలయ్యాయి. పూర్తివడపోత తదుపరే ఈనెల 18న అర్హుల జాబితాను అధికార యంత్రాంగం సిద్ధం చేయనుంది. ఈనెల 21 నుంచి నిర్వహించే గ్రామ,వార్డు సభల్లో సంబంధిత అర్హుల జాబితాను ప్రదర్శించి లబ్ధిదారుల ఎంపికను చేపట్టనున్నారు. 26వ తేదీలోపు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తికానుంది.

● నియోజక వర్గానికి 3,500 ఇళ్లు

ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపుల్లో భాగంగా తొలి విడుతలో ప్రతీ నియోజక వర్గానికి 3,500 ఇళ్ల అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. వీటిల్లో గ్రామాలు, పట్టణాల వారీగా ఎక్కడెక్కడ ఎన్ని కేటాయించాలనే వియంలో అధికార యంత్రాంగం దృష్టి సారించింది. మొత్తం 3,500 ఇళ్లలో గ్రామాలు, పట్టణాల వారీగా మంజూరు చేసిన వాటి వివరాలను అధికారులు జిల్లా ఇన్‌చార్జీ మంత్రికి సమర్పించనున్నారు. సంబంధిత మంజూరు వివరాలను పరిశీలించిన పిదప మంత్రి అమోదం తెలుపుతారు. అనంతరం మంజూరి వివరాలను గ్రామ సభల్లో అధికారులు ప్రదర్శిస్తారు. తొలి విడత ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియలో అతి పేదలు, ఒంటరి మహిళలు, వితంతువులు, దివ్యాంగులకు ప్రాధాన్యతనివ్వనున్నారు. లబ్ధిదారుల ఎంపిక విషయంలో ఇందిరమ్మ కమిటీలు ప్రధాన పాత్ర పోషించనున్నాయి.

మందుబాబులకు అడ్డాగా పల్లె ప్రకృతివనం



కరత్వాడ పల్లె ప్రకృతి వనంలో మందుబాబులు పారేసిన మద్యం సీసాలు

బోథ్, జనవరి17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కరత్వాడ పల్లె ప్రకృతి వనం తాగుబోతులకు అడ్డాగా మారింది. రోజూ రాత్రి కాగానే మందుబాబులు పల్లె ప్రకృతి వనానికి చేరుకుని హంగామా చేస్తున్నారని స్థానిక ప్రజలు పేర్కొంటున్నారు. మద్యం తాగేవారు ఇతర గ్రామాల నుంచి వచ్చి పల్లె ప్రకృతి వనంలో తిష్ట వేస్తున్నారని చెప్తున్నారు. అయితే పల్లె ప్రకృతి వనం నిండా మద్యం సీసాలు దర్శనమిస్తున్నాయి. తాగుబోతులకు పల్లె ప్రకృతి వనం అడ్డాగా మారిందని గ్రామస్తులు వాపోతున్నారు. అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి

నేరడిగొండ, జనవరి17 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యంపై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్‌ఈవో పవార్ రవీందర్ అన్నారు. శుక్రవారం మండలంలోని గుత్పల్ల గ్రామాల్లో వైద్యశిబిరం నిర్వహించారు. కిడ్నీ వ్యాధుల బారిన పడ్డ రోగుల రక్తనమూనాలను సేకరించారు. నీరు ఎక్కువగా తీసుకోవాలన్నారు. చికిత్స చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ నరేందర్ రెడ్డి, ఉత్తమ్ సింగ్, శ్రీనివాస్ రెడ్డి, ఏఎన్ఎం, ఆశలు పాల్గొన్నారు.



గుత్పల్లలో వైద్య శిబిరం నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది



సూరజ్‌సింగ్ మహారాజ్‌తో మాట్లాడుతున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత

నేరడిగొండ,జనవరి17 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని మధురాల కుల గురువు సంత్ శ్రీ సూరజ్ మహారాజ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో గల బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ నివాసానికి రాగా అనిల్ జాదవ్ ఆయన ఆశీర్వాదం తీసుకున్నారు. నియోజకవర్గంలో గల గ్రామాలలో ఆలయాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అనిల్ జాదవ్‌కు సూచించారు. ఈ సందర్భంగా సూరజ్‌సింగ్ మహారాజ్‌ను శాలువతో సన్మానించారు. ఆలయాల అభివృద్ధి కోసం తనవంతు కృషి చేస్తానని అనిల్ జాదవ్ అన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు ఉన్నారు.

ఆర్టీసీకి 'ఆర్థిక' సంక్రాంతి

● రీజియన్ పరిధిలో 298 అదనపు బస్సులు ● 51,104 మంది ప్రయాణికుల రాకపోకలు ● రూ.97.80 లక్షల ఆదాయం



భైంసా బస్టాండ్‌లో బస్సుల వద్ద ప్రయాణికుల రద్దీ



ఆర్టీసీ బస్సులు

భైంసా, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పర్వదిన వేడుకలు ఆర్టీసీకి ఆర్థిక క్రాంతినిచ్చాయి. పర్వదిన వేడుకలను పురస్కరించుకొని అదనపు బస్సులను నడుపడం ద్వారా మంచి లాభాలను గడించింది. రీజియన్ పరిధిలో సాధారణ బస్సులతో పాటు ప్రయాణికుల రద్దీని దృష్టిని పెట్టుకొని వివిధ రూట్లలో 298 అదనపు బస్సులను నడిపింది. దీంతో రోజు వారీ ఆదాయంతో పాటు అధనంగా రూ.97.80 లక్షల ఆదనపు ఆదాయన్ని ఆర్జించింది.


● ప్రయాణికుల రద్దీ రూట్లలో 298 అదనపు బస్సులు

ఆర్టీసీ ఆదిలాబాద్ రీజియన్ పరిధిలో ఆదిలాబాద్, మంచిర్యాల్, అసిఫాబాద్, నిర్మల్, భైంసా కేంద్రాలలో బస్సు డిపోలు ఉన్నాయి. సంక్రాంతి పర్వదిన వేడుకలలో భాగంగా రీజియన్‌లోని ఐదు డిపోల పరిధిలో మొత్తం 298 అదనపు బస్సులను నడుపగా రూ.97.80 లక్షల ఆదాయం చేకూరింది. మొత్తం 51, 104 మంది ప్రయాణికులు అదనపు బస్సులలో రాకపోకలు నిర్వహించారు. ఆదిలాబాద్ డిపో పరిధిలో 53 అధనపు బస్సులను నడుపగా 108 శాతం అక్యూపెన్సీతో రూ.21.98 లక్షల ఆదాయం చేకూరగా 10,351 మంది ప్రయాణికులు ప్రయాణాలు చేపట్టారు. భైంసా డిపో పరిధిలో 13 అదనపు బస్సులు నడుపగా 2,226 మంది ప్రయాణికులు రాకపోకలు చేపట్టారు. డిపో పరిధిలో 127 శాతం ఆక్యుపెన్సీతో రూ.5.25 లక్షల అధనపు ఆదాయం సమకూరింది. ఇక మంచిర్యాల్ డిపో పరిధిలో 104 అదనపు బస్సులు నడుపగా 87శాతం ఆక్యుపెన్సీతో రూ.28.72 లక్షల రాబడి చేకురగా 14,730 మంది ప్రయాణికులు ప్రయాణాలు నిర్వహించారు. నిర్మల్ డిపో పరిధిలో 86 అదనపు బస్సులు ఏర్పాటు చేయగా వీటిల్లో 8,673 మంది ప్రయాణికులు రాకపోకలు నిర్వహించారు. డిపోకు 99శాతం ఆక్యుపెన్సీతో రూ.23.28 లక్షల ఆదాయం చేకూరింది. అసిఫాబాద్ డిపో పరిధిలో 42 అదనపు బస్సులు నడుపగా 14,824 ప్రయాణికులు ప్రయాణాలు చేపట్టగా ఇక్కడి డిపోకు 108శాతం ఆక్యుపెన్సీతో రూ.18.56 లక్షల ఆదాయాన్ని ఆర్జించింది.

ప్రణాళికాబద్ధమైన చర్యలు చేపట్టాం

● సోలోమన్, ఆర్టీసీ రీజినల్ మేనేజర్, ఆదిలాబాద్

సంక్రాంతి పర్వదిన వేడుకలకు సంబంధించి ప్రయాణికుల రాకపోకలను దృష్టిలో పెట్టుకొని ప్రణాళికాబద్ధమైన చర్యలు చేపట్టాం. ముందస్తుగా ప్రణాళికలు రూపోందించి రద్దీ అధికంగా ఉంటే రూట్లలో అదనపు బస్సు సర్వీసులను నడిపించేలా చర్యలు చేపట్టాం. ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యాలు, అవస్థలు కలుగకుండా ముందు చూపుతో వ్యవహరించాం. రీజియన్‌లోని ఐదు బస్సు డిపోల పరిధిలో మొత్తం 298 అదనపు బస్సు సర్వీసులను నడిపాం. తిరుగుప్రయాణంలో సైతం అదనపు బస్సులను నడిపిస్తూ ప్రయాణికులు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకున్నాం. ఆర్టీసీ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది సమన్వయంతో వ్యవహరిస్తూ సమిష్టిగా కృషిచేయడం మూలంగా అదనపు ఆదాయం చేకూరింది.



కొనసాగుతున్న టీబీ వ్యాధి నిర్ధారణ పరీక్షలు

బోథ్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): టీబీ వ్యాధి నిర్ధారణ పరీక్షలు గ్రామాల్లో కొనసాగుతున్నాయి. 100 రోజుల కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కనుగుట్టలో టీబీ వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యసిబ్బంది టీబీ వ్యాధికి గల కారణాలను వ్యాధి అదుపునకు గల తీసుకోవాల్సిన చర్యలను వివరిస్తున్నారు. అంతేగాక టీబీ వ్యాధి అనుమానం ఉన్న పరీక్షలు నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్ దేవిదాస్, హెచ్ఈ సంధ్య, టీబీ సూపర్ వైజర్ సుధా, రవీందర్, అలేఖ్య ఏఎన్ఎంలు లలిత, పావని, హెల్త్ అసిస్టెంట్ గోవర్ధన్, ఆశావర్కర్లు ఉన్నారు.

నేడే నవోదయ పరీక్ష

- పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి
- ఉమ్మడి జిల్లాకు 5191 మంది విద్యార్థుల దరఖాస్తులు
- జిల్లాలో ఐదు పరీక్షా కేంద్రాల ఏర్పాటు

ఆదిలాబాద్‌రూరల్, జనవరి17 (ఆంధ్రజ్యోతి): 2025-26 విద్యా సంవత్సరానికి జవహర్ నవోదయ విద్యాలయంలో 6వ తరగతిలో ప్రవేశానికి శనివారం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ప్రవేశపరీక్ష నిర్వహించనున్నారు. ఇందుకు ఇప్పటికే విద్యాలయ సమితి అన్నిజిల్లాల్లో ఏర్పాట్లు చేపట్టింది. ఉమ్మడి జిల్లాకు చెందిన జవహర్ నవోదయ విద్యాలయం కాగజ్‌నగర్‌లో ఉంది. రాబోయే విద్యాసంవత్సరంలో ఆరో తరగతి ప్రవేశానికి గత ఆగస్టులోనే విద్యార్థులు దరఖాస్తులు చేసుకున్నారు.ఉమ్మడి జిల్లా నుంచి 5 వేల 191 మంది పరీక్ష రాయనుండగా వారికి కోసం 24 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం 11 గంటల 30 నిమిషాల నుంచి 1గంటల 30 నిమిషాల వరకు పరీక్ష కొనసాగుతుంది. ఇప్పటికే హాల్ టికెట్లను ఆన్‌లైన్‌లో పొందుపర్చారు. ఈ సందర్భంగా డీఈఓ ప్రణీత మాట్లాడుతూ జిల్లా లో నవోదయ పరీక్షకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. జిల్లా వ్యాప్తంగా 1170 మంది విద్యార్థులకు 5 కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలో గర్ల్స్ హైస్కూల్, లిటిల్ ఫ్లవర్, అకాడమీతోపాటు ఇచ్చోడ, ఉట్నూర్‌లో కేంద్రాలను ఏర్పాటుచేసి సౌకర్యాలు కల్పించామన్నారు. పరీక్షల సూపరింటెండెంట్‌లు, పరిశీలకులను కూడా నియమించామన్నారు. విద్యార్థులు పరీక్ష సమయానికి కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. ఆలస్యం అయితే కేంద్రాల్లోకి అనుమతి ఉందని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

నాగోబా జాతర నిర్వహణకు వేలం



వేలం నిర్వహిస్తున్న తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్

ఇంద్రవెల్లి, జనవరి17 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీల ఆరాధ్యదైవం, రాష్ట్ర పండుగగా గుర్తింపు పొందిన కేస్లాపూర్ నాగోబా జాతర సందర్భంగా జాతర ఏర్పాటు చేసే తైబజార్‌కు మండల అధికారులు గురువారం మండలంలోని కేస్లాపూర్ గ్రామంలోని నాగోబా దర్బార్ హాల్‌లో వేలం పాట నిర్వహించారు. స్థానిక తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో వేలం నిర్వహించగా తైబజార్ నిర్వాహకులను రూ.7 లక్షల 26 వేలకు కేంద్రే అవధూత్ దక్కించుకున్నారు. అలాగే జాతరలో దుకాణ సముదాయాలకు విద్యుత్ సరఫరాకు రూ.2లక్షల ఒక వెయ్యికి ఎండీ బాబా, జాతరలో ప్యాలాలు, పుట్నాల కోసం రూ.50 వేలకు టి.నరేష్ జాతరలో కొబ్బరికాయల విక్రయానికి రూ.20వేలు బి.శివా వ్యాపారస్తులు దక్కించుకున్నట్లు తహసీల్దార్ ప్రవీణ్ కుమార్ తెలిపారు. నాగోబా జాతరకు వేలం ద్వారా రూ.9లక్షల 97వేల ఆదాయం వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాగోబా ఆలయ కమిటీ ఈవో రాజమౌళి, ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావు పటేల్, మాజీ సర్పంచ్ మెస్రం రేణుక నాగనాథ్, మాజీ ఆలయ కమిటీ చైర్మన్ మెస్రం తుకారం, దేవాదాయ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఏజెన్సీలో 'ఇందిరమ్మ'కు ఇబ్బందులే..!




- జిల్లాలో పూర్తయిన ఇందిరమ్మ ఇళ్ల సర్వే
- గిరిజనేతరులకు ఇళ్ల కేటాయింపుపై అనుమానాలు
- ఇప్పటికే కోర్టుకు చేరిన ఉట్నూర్ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంచాయితీ
- ఏజెన్సీలో స్థిర నివాసానికి అనుమతులు లేవంటూ అధికారుల నోటీసులు
- ప్రభుత్వమే ప్రత్యామ్నాయం చూపాలంటున్న లబ్ధిదారులు

ఆదిలాబాద్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల పథకానికి ఆటంకాలు ఎదురయ్యే అవకాశం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలో ఎక్కువగా ఏజెన్సీ మారుమూల ప్రాంతమే కావడంతో గిరిజనేతరులకు ఇళ్ల కేటాయింపు ప్రశ్నార్థకంగా మారింది. ముఖ్యంగా ఎస్సీ, బీసీ, మైనార్టీ, ఓసీ, ఇతర గిరిజనేతరులు ఎక్కువగానే నివసిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఏజెన్సీలో నివసిస్తున్న గిరిజనేతరులకు ఎక్కడా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లని కేటాయించిన దాఖలాలు లేవు. అయితే కొత్తగా అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం గిరిజనేతరులకు ఏవిధంగా ఇంటిని నిర్మించి ఇస్తుందోనన్న వాదనలు వినిపిస్తున్నాయి. గతంలో రాష్ట్రప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలనలో భాగంగా జిల్లా వ్యాప్తంగా లక్షా 97వేల 448మంది ఇందిరమ్మ ఇళ్ల కోసం ధరఖాస్తులు చేసుకున్నారు. ప్రభుత్వ ఆదేశాలతో క్షేత్రస్థాయిలో దాదాపుగా సర్వే ప్రక్రియ కూడా పూర్తయింది. ఇక జనవరి 26 నుంచి పథకాన్ని ప్రారంభించి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. అయితే ఇటీవల కొత్తగా ఏర్పడిన మూడు మండలాలతో మండలాల సంఖ్య 21కి చేరింది. మొత్తం 473 గ్రామపంచాయతీలు ఉన్నాయి. ఇందులో ఎక్కువగా 251 గ్రామపంచాయతీలు పూర్తిగా ఏజెన్సీ గ్రామపంచాయతీలుగానే కొనసాగుతున్నాయి. ఇందిరమ్మ పథకాన్ని ప్రారంభిస్తే గిరిజనేతరుల నుంచే ఎక్కువగా డిమాండ్లు వచ్చే అవకాశం ఉంది. కానీ ఏజెన్సీలో చట్టపరమైన ఇబ్బందులు ఎదురయ్యే పరిస్థితి ఉంటుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో ప్రభుత్వమే ప్రత్యామ్నాయం చూపి అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇంటిని నిర్మించి ఇవ్వాలన్న డిమాండ్లు వినిపిస్తున్నాయి.

ఎక్కువ దరఖాస్తులు గిరిజనేతరుల నుంచే..

జిల్లాలో ఇందిరమ్మ ఇండ్లకోసం వచ్చిన దరఖాస్తుల్లో ఎక్కువగా గిరిజనేతరుల నుంచే వచ్చినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. లక్షా 97 వేల 448 దరఖాస్తులురాగా ఇందులో లక్షకు పైగా గిరిజనేతరులే దరఖాస్తు చేసుకున్నట్లు తెలుస్తోంది. అలాగే జిల్లాలో 21 మండలాలకు భీంపూర్, ఆదిలాబాద్ అర్బన్ మండలాలు మినహా 19మండలాల్లో ఏజెన్సీ గ్రామపంచాయతీలున్నాయి. ఉట్నూర్, ఇంద్రవెల్లి, నార్నూర్, గాదిగూడ మండలాలు పూర్తిగా ఏజెన్సీలోనే కొనసాగుతున్నాయి. జిల్లాలో ఇందిరమ్మ ఇళ్లను కేటాయించాలని ప్రభుత్వం భావిస్తోంది. అయితే మైదాన ప్రాంతంలో పెద్దగా ఇబ్బందులు లేకపోయినా ఏజెన్సీ మారుమూల గ్రామాల్లో మాత్రం గిరిజనేతరులతో కొంతమేరకు న్యాయపరమైన చిక్కులు వచ్చే అవకాశం ఉందంటున్నారు. ఏజెన్సీలో గిరిజనేతరులు ఖాళీ స్థలాలు కలిగి ఉన్న వాటికి ఎలాంటి పట్టా ఆధారం లేకపోవడంతో ఏమీ చేయలేని పరిస్థితి ఉంటుందన్న వాదనలు వినిపిస్తున్నాయి.



జిల్లాలో ఏజెన్సీ ప్రాంతమైన ఇంద్రవెల్లి మండల కేంద్రం

ఉట్నూర్ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లపై కోర్టుకు..

గత ప్రభుత్వ హయాంలో ఉట్నూర్ మండల కేంద్రంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లపై కొందరు కోర్టును ఆశ్రయించినట్లు తెలుస్తోంది. అప్పట్లో నిర్మాణాలు పూర్తయిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను లబ్ధిదారులకు కేటాయించేందుకు అధికారులు జాబితాను సిద్ధం చేశారు. కానీ ఏజెన్సీలో గిరిజనేతరులకు ఎలా స్థిరనివాసం కల్పిస్తారంటూ కొందరు కోర్టును ఆశ్రయించడంతో ఆ ప్రక్రియ అర్థాంతరంగానే నిలిచిపోయింది. ఇప్పటివరకు ఎవరికి ఇళ్ల కేటాయింపు చేయకపోవడంతో వృధాగానే మారి కనిపిస్తున్నాయి. ప్రస్తుతం ప్రభుత్వం కూడా ఇందిరమ్మ ఇళ్ల పథకానికి శ్రీకారం చుట్టింది. ఒకవేళ ఏజెన్సీలో గిజనేతరులకు ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తే ఇబ్బందులు తప్పవన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. పూర్తి స్థాయిలో విధివిధానాలు ఖరారు అయితే తప్ప ఏజెన్సీలో ఇందిరమ్మ ఇళ్లపై స్పష్టత వచ్చే అవకాశం లేదని అధికారులు చెబుతున్నారు. ఇలాంటి పరిస్థితులతో ఏజెన్సీలోని గిరిజనేతరులు పలు ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దూరమవుతున్నారు. ఎలాంటి భూపట్టా ఆధారం లేదన్న కారణంగా ఇప్పటికే రైతుబంధు, పంటల రుణమాఫీకి నోచుకోవడంలేదు. అలాగే గతంలో ఉట్నూర్ గ్రామపంచాయతీని మున్సిపాలిటీగా ఏర్పాటుచేసేందుకు ఎన్నో ప్రయాత్నాలు జరిగాయి. కానీ ఏజెన్సీ చట్టాల కారణంగా ప్రభుత్వం వెనుకడుగు వేయాల్సి వచ్చింది. ఏజెన్సీలో ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఎలాంటి నిబంధనలను తీసుకుంటుందో వేచిచూడాల్సి ఉంది.

కొత్త నిర్మాణాలను వద్దంటున్నారు..

ఏజెన్సీలో గిరిజనేతరులు చేపడుతున్న కొత్త నిర్మాణాలను అధికారులు అడ్డుకుంటున్నారు. ఇప్పటికే ఇంద్రవెల్లి, ఉట్నూర్, నార్నూర్ మండలాల్లోని పలు ఇళ్లకు అధికారులు మౌఖిక ఆదేశాలతోపాటు నోటీసులను అందజేస్తున్నారు. అధికారుల అనుమతి లేనిదే ఏజెన్సీలో గిరిజనేతరులు ఎలాంటి నిర్మాణాలను చేపట్టవద్దంటూ సూచిస్తున్నారు. దీంతో కొన్ని ఇండ్ల నిర్మాణాలు మధ్యలోనే నిలిచిపోయాయి. ఇదేమిటని స్థానిక అధికారులను ప్రశ్నిస్తే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇలాంటి నిర్ణయం తీసుకోవాల్సి వస్తుందని చెబుతున్నారు. ముఖ్యంగా ఘటనతో ప్రభుత్వం, జిల్లా అధికారులు అప్రమత్తం అయ్యారు. అప్పటి నుంచే ఏజెన్సీ ప్రాంతంలో కొత్త నిర్మాణాలను అధికారులు అడ్డుకుంటున్నారని చెబుతున్నారు. మరీ ఇందిరమ్మ నిర్మాణాలను ఎలా చేపడతారోనన్న చర్చ సాగుతుంది. అయితే ఇప్పుడున్న పరిస్థితుల్లో ఆదివాసీ ఏజెన్సీ చట్టాలలో మార్పులు చేర్పులు చేయడం ప్రభుత్వానికి అంత తేలికైన పనేమీ కాదంటున్నారు.



మర్కగూడలో గెలిచిన జట్టుకు బహుమతి ప్రదానం చేస్తున్న దృశ్యం

ముగిసిన కబడ్డీ పోటీలు

భీంపూర్, జనవరి17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మర్కగూడలో మూడు రోజుల నుంచి నిర్వహిస్తున్న రాంజీగోండ్ యూత్ కబడ్డీ టోర్నమెంట్ గురువారం అర్థరాత్రితో ముగిశాయి. ఫైనల్‌లో కిన్వట్, పైజాపూర్, డోన్‌గర్ గావ్, లాల్‌గడ జట్లు పోటీ పడగా మొదటి బహుమతి కిన్వట్ జట్టు, రెండో బహుమతి పైజాపూర్, మూడో బహుమతి డోన్‌గర్‌గావ్, నాల్గో బహుమతి లాల్‌గాధ జట్లు గెలుచుకున్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కుడ్మెత సంతోష్, మెస్రం నాగోరావ్, మాజీ సర్పంచ్ లింబాజీ, ఉత్తం రాథోడ్, సంజీవ్, మడావి వినోద్, తదితరులు పాల్గొన్నారు.

'మాంగ్ కులానికి ధ్రువీకరణపత్రం ఇవ్వాలి'

నార్నూర్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం షెడ్యూల్ కులంలోని మాంగ్ కులానికి మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలోనే కులధ్రువీకరణ పత్రం జారీచేయాలని శుక్రవారం మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రాజలింగుకు మాంగ్ సమాజ్ నాయకులు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్డీఓ కార్యాలయం నుంచి కుల ధ్రువీకరణ పత్రం ఇవ్వడం వలన ప్రాంత ప్రజలకు చాలా ఇబ్బందులు ఎదురవుతున్నాయని వారు పేర్కొన్నారు. ప్రత్యేకంగా ఇక ముందు ప్రభుత్వ గజిట్‌లో మాంగ్ కులానికి సీరియల్ నెంబర్ 42 ఉన్నందున తహసీల్దార్ కార్యాలయంలోనే తమకు పత్రాలు అందించేలా తగు చర్యలు వెంటనే ప్రభుత్వం తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. సంబంధిత అంశాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్తానని తహసీల్దార్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు సంతోష్, సాయి, వసంత్, సిద్దు, దినేష్ పాల్గొన్నారు.

చెరువులో మునిగి పశువుల కాపరి మృతి

బోథ్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): స్నానం చేసేందుకు చెరువులో దిగిన పశువుల కాపరి బర్దావల్ రామేశ్వర్ (19) ప్రమాదవశాత్తు చెరువులో మునిగి మృతిచెందాడు. మండలంలోని కండెగాం చెరువు వద్ద శుక్రవారం ఈ ఘటన చోటుచేసుకుంది. ఎస్సై ప్రవీణ్ తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం ఉదయం 8గంటల సమయంలో స్నానం చేసేందుకు రామేశ్వర్‌తోపాటు అమర్‌సింగ్ పండరి అంకుశ్లు చెరువులో దిగారు. అయితే లోతైన నీటి గుంటలో మునిగి రామేశ్వర్ మృతి చెందాడు. అయితే నీటిలో మునిగిన సమయంలో అక్కడే ఉన్న వారు ఆయనను కాపాడేందుకు ప్రయత్నించినా ఈత రాకపోవడంతో విఫలమయ్యారు. అయితే మృతుడు మహారాష్ట్రలోని చంద్రాపూర్ జిల్లా డోంగ్రాగావ్ గ్రామానికి చెందినవాడని ఎస్సై తెలిపారు. మధ్యాహ్నం గజ ఈతగాళ్లు చెరువులో గాలించగా మధ్యాహ్నం ఒంటిగంట 15 నిమిషాలకు మృతదేహం లభించిందన్నారు. మృతుని తండ్రి బర్దావల్ బాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

జిల్లా అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలి

- ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఆదిలాబాద్ రూరల్, జనవరి17 (ఆంధ్రజ్యోతి): అర్హులైన అందరికీ సంక్షేమ పథకాలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, జిల్లా అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ కోరారు. శుక్రవారం నిర్మల్లో నిర్వహించిన ఉమ్మడి జిల్లాస్థాయి సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇల్లు పథకాలపై ప్రభుత్వానికి ఎమ్మెల్యే పలు సూచనలు చేశారు. రాష్ట్రంలో వెనుకబడిన ఆదిలాబాద్ జిల్లాపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని ఈ సందర్భంగా కోరారు.



మాట్లాడుతున్న ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్

దేశీదారు బాటిళ్ల స్వాధీనం

ఆదిలాబాద్ రూరల్, జనవరి17 (ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రంలోని మహాలక్ష్మివాడకు చెందిన దినేష్ వద్ద 140 దేశీదారు సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు టూటౌన్ సీఐ సీహెచ్ కరుణాకర్‌రావ్ తెలిపారు. మహారాష్ట్ర నుంచి అక్రమంగా దేశీదారు తీసుకొచ్చి ఆదిలాబాద్‌లో విక్రయించేందుకు ప్రయత్నించే క్రమంలో స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలో దినేష్‌ను అదుపులోకి తీసుకున్నామన్నారు. అతడిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

దేశీదారు, నాటుసారా అమ్మితే కేసులు

దేశీదారు, నాటుసారాపై శుక్రవారం నుంచి ఫిబ్రవరి 15 వరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ఆదిలాబాద్ జిల్లా ప్రొబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి హేమశ్రీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ డ్రైవ్‌లో భాగంగా జిల్లాలో నాటుసారా తయారీ కేంద్రాలను గుర్తించాలని అధికారులకు సూచించారు. ముడిసరకు రవాణా అరికట్టేందుకు, తయారి, సరఫరాదారులపై కేసులు నమోదు పెడతామన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు.

సర్వే వివరాలను తప్పుల్లేకుండా నమోదు చేయాలి



సర్వేను పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారి

నేరడిగొండ, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలుకు అర్హుల గుర్తింపు కోసం చేస్తున్న సర్వే వివరాలను తప్పుల్లేకుండా నమోదు చేయాలని మండల ప్రత్యేకధికారి రవిశంకర్, ఎంపీడీవో అన్నారు. శుక్రవారం మండలంలోని కిష్టాపూర్‌లో కొనసాగుతున్న సర్వేను పరిశీలించారు. ప్రతీ ఇంటికి వెళ్లి సర్వే చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ, మండల వ్యవసాయ అధికారి, గ్రామ పంచాయతీ అధికారులు ఏఈవో, ఆర్ఐ, సర్వేయర్, మిషన్ భగీరథ ఏఈ, కిస్టాపూర్ గ్రామ రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి జోగు రామన్న

సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలి

ఆదిలాబాద్‌రూరల్, జనవరి17(ఆంధ్రజ్యోతి): కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించే దిశగా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. ఏఐటీయూసీ అనుబంధ మున్సిపల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా మూడో మహాసభలను శుక్రవారం ఆదిలాబాద్‌లో నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి పాల్గొని మాట్లాడారు. బీఆర్ఎస్ హయాంలో కార్మికుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించినట్లు గుర్తుచేశారు.

బరంపూర్‌లో ముదిగ మల్లన్న సందడి



మొక్కులు చెల్లించుకున్న భక్తులు

తలమడుగు, జనవరి17 (ఆంధ్రజ్యోతి): బరంపూర్ గ్రామంలో శుక్రవారం ముదిగమల్లన్న సందడి నిర్వహించారు. గ్రామంలోని పలు వీధుల గుండా భజాభజంత్రీలతో తిరుగుతూ భక్తులకు ఆశీర్వాదం అందిస్తూ భక్తులు చెల్లించే మొక్కులను స్వీకరించారు. ఇందులో భాగంగా బరంపూర్ గ్రామస్తులు, సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు.

'కుప్టి(కె)ను గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలి'

నేరడిగొండ, జనవరి17 (ఆంధ్రజ్యోతి): కుప్టి(కే)ను నూతన గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలని కోరుతూ కుప్టి(కే), గాంధారి గ్రామస్థులు శుక్రవారం బోథ్ నియోజకవర్గ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్, తహసీల్దార్ ఖలీంలకు వినతిపత్రం అందజేశారు. కుమారి గ్రామపంచాయతీ పరిధిలో అనుబంధ గ్రామాలుగా ఉన్నాయని, భౌగోళికంగా కుమారి గ్రామ పంచాయితీ పెద్ద గ్రామ పంచాయతీగా ఉన్నందున తగు విధంగా పాలన, అధికార సౌకర్యాలు అందడం లేదన్నారు. రెండు గ్రామాల జనాభా కలిగి 600 వరకు ఉంటుందన్నారు. వెంటనే నూతన గ్రామ పంచాయితీగా ఏర్పాటు అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంల నక్క లక్ష్మణ్, మాజీ ఎంపీటీసీ ఆత్రం లక్ష్మణ్, వడ్ల నారాయణ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న కుప్టి, గాంధారి గ్రామస్థులు



కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న వేణుగోపాలచారి

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

- పార్టీ సీనియర్ నాయకులు వేణుగోపాలచారి

నేరడిగొండ, జనవరి17 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని కాంగ్రెస్‌పార్టీ రాష్ట్రసీనియర్ నాయకుడు వేణుగోపాలచారి అన్నారు. శుక్రవారం మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ అధ్వర్యంలో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరిన మాజీ బోథ్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బానోత్ వసంత్‌రావుకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వేణుగోపాలచారి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేసిందన్నారు. రాబోయే రోజుల్లో ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా సైతం ఇవ్వనుందన్నారు. స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు ఆడే వసంత్‌రావ్, రాజశేఖర్‌రెడ్డి, బద్దం పోతారెడ్డి, సద్దాం, సుభాష్, జనార్ధన్ తదితరులు ఉన్నారు.

బోథ్‌లో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయాలి

- తహసీల్దార్‌కు ధర్మసమాజ్ పార్టీ నాయకుల వినతి

బోథ్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): బోథ్‌లో అగ్నిమాపక కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ధర్మసమాజ్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం తహసీల్దార్ సుభాష్ చంద్రకు ఈ విషయమై వినతి పత్రం అందజేశారు. ప్రతీఏటా అగ్ని ప్రమాదాలు సంబంధించి లక్షలాది రూపాయలు నష్టం జరుగుతోందని, అయితే ఈ విషయమై గతంలో ధర్నా కార్యక్రమాలను చేపట్టిన ప్రభుత్వం స్పందించడం లేదని వాపోయారు. వచ్చే వేసవికాలాన్ని దృష్టిలో ఉంచుకొని మండలకేంద్రంలో ఫైర్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ధర్మ సమాజ పార్టీ మండల అధ్యక్షుడు కొండమడుగు గణేష్, నాయకులు బిక్క రమేష్, కుందూరు సుధాకర్, పెందూర్ జల్దేవ్, కృష్ణ, పెల్లి స్వాములు ఉన్నారు.